క్లుప్తంగా

ముమ్మరంగా ఓటు నమోదు పక్రియ



జంపని(వేమూరు): కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఓటు నమోదు పక్రియ ముమ్మరం చేశారు. వేమూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారుల ఓట్లు నమోదు పక్రియ ప్రారంభించారు. జంపని గ్రామంలో వీఆర్వోలు ఓట్లు నమోదు, తొలగింపుపై సర్వే ముమ్మరంగా చేస్తున్నారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన బూత్ లెవల్ అధికారులు సర్వే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

ఎండుచేపల ప్రాసెసింగ్‌పై అవగాహన



నిజాంపట్నం: ఎండు చేపల అమ్మకాలతో మత్స్యకార సంఘ మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని ఎంఎస్ఎంఈ ఏడీ డాక్టర్ కేఎల్ఎస్ రెడ్డి తెలిపారు. నిజాంపట్నం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎండుచేపల ప్రాసెసింగ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ఎస్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకార సంఘ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎండుచేపల ప్రాసెసింగ్ యూనిట్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ఎండుచేపల ప్రాసెసింగ్ యూనిట్‌ను సద్వినియోగ పరుచుకుని ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ సందర్భంగా ఎండుచేపల ప్రాసెసింగ్ యూనిట్‌వల్ల కలిగే ఉపయోగాలను మత్స్యకార సంఘ మహిళలకు వివరించారు. డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు, ఎంపీడీఓ నాగలక్ష్మి, మండల స్పెషల్ ఆఫీసర్, ఫిషరీస్ జేడీ సురేష్, అడిషనల్ డైరెక్టర్ సరళ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సహనంతో పరిష్కరించాలి

రేపల్లెరూరల్: సమస్యలపై వచ్చిన ప్రజలకు సహనంతో సేవలను అధికారులు అందించాలని సీఐ నజీర్‌బేగ్ అన్నారు. మండలంలోని పేటేరు సచివాలయ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. గ్రామీణుల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉంటారని, అటువంటి వారు కేంద్రాలకు వస్తే సహనంతో సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వసుమతి, ఉప సర్పంచ్ జి.ప్రతాప్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌ఛార్జ్ రవికిరణ్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున నగర పరిధిలోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ యు శారదాదేవి విజ్ఞప్తి చేశారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగి పడే ప్రమాదం పొంచి ఉందని, అటువంటివి గుర్తిస్తే వెంటనే నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ 7093912653 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. మరీ ముఖ్యంగా విలీన గ్రామాల పరిధిలో చెరువులు, వాగులు కోతకు గురి అయ్యే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు, టెస్టులు హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీరు తాగాలని కమిషనర్ శారదాదేవి సూచించారు.

లక్ష్మీనారసింహుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని లక్ష్మీనారసింహస్వామి వారికి బుధవారం స్వాతి నక్షత్ర పూజలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు స్వహస్తాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పొంగళ్లుపొంగించి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

పచ్చదనంతోనే ప్రశాంత జీవనం

నియోజకవర్గ వ్యాప్తంగా గ్రీన్ బాపట్ల ర్యాలీలు



పిట్టలవానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

కొల్లూరు: పరిసరాలు పచ్చదనంతో నిండి ఉండటంతోనే ప్రశాంత జీవనం సాధ్యపడుతుందని కొల్లూరు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు అన్నారు. బుధవారం కొల్లూరు మండలపరిషత్తు కార్యాలయం వద్ద జిల్లావ్యాప్తంగా చేపట్టనున్న మొక్కలు నాటే కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పెరటి తోటల పెంపకంతోపాటు, మొక్కలను నాటి, సంరక్షించి ప్రకృతి సమతుల్యతను కాపాడాలని కోరారు. ఏపీఎం రాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, నగరాజకుమారి, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ బాపట్లను విజయవంతం చేయండి ...

పిట్టలవానిపాలెం: గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ షేక్ బాజి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ బాపట్ల కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించనున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటేందుకు ఈకార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, శ్మశాన వాటికలు తదితర ప్రాంతాలలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థికి ఒక మొక్క చొప్పున దత్తత ఇచ్చి వారు 10వ తరగతికి వచ్చే వరకు మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ఉంటుందని సూచించనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 6,200 మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమం గురించి అన్ని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త, ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ, ఏపీఎం సంతోష్, సీసీలు గాంధీ, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.



కొల్లూరు ప్రదర్శన

కర్లపాలెంలో...

కర్లపాలెం: గ్రీన్ బాపట్లలో భాగంగా కర్లపాలెం మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయాలని కర్లపాలెం ఎంపీడీఓ, డీపీఓ దాసరి రాంబాబు తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు ఆదేశాలతో మొక్కలు నాటే క్యాక్రమంపై వీఓఏలకు, డ్వాక్రా మహిళలకు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం డ్వాక్రా మహిళలు, వలంటీర్లతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కేశవ నారాయణరావు, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, ఏపీఓ శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఏపీఓ సుందర్‌రావు పాల్గొన్నారు.

గణపవరం(కర్లపాలెం): పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు పెంచాలని గణపవరం సర్పంచ్ దేవరకొండ అంకమ్మ తెలిపారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా బుధవారం గణపవరం గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేటేరులో...

రేపల్లె రూరల్: పచ్చదనం – పరిశుభ్రతను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ శివపార్వతి అన్నారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా మండలంలోని పేటేరు పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమంపై బుధవారం సచివాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 28వ తేదీన పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



ఖాజీపాలెంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

పిట్టలవానిపాలెం: మండలంలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా మండలంలోని ఖాజీపాలెం శివారు కప్పలవారిపాలెం, ఖాజీపాలెం సెంటర్‌లోని ప్రధాన రహదారి, చందోలు శివారు కత్తివారిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెం, కొత్తపాలెం గ్రామాలలో రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

నీట మునిగిన పొలాలు...

వేమూరు: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి వెదసాగు పొలాలు నీటి మునిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వెద సాగు వైపు మొగ్గు చూపారు. వేమూరు మండలంలోని 20 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. ఇప్పటి వరకు 10 వేల ఎకరాల్లో రైతులు వెదపద్ధతిలో సాగు చేపట్టారు. కొంతమంది రైతులు వరి విత్తనాలు జల్లారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల వెద సాగు చేసిన పొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే వ్యక్తిగత విమర్శలు

- కోన కుటుంబాన్ని విమర్శించే స్థాయి ఎవరికీ లేదు
- మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి



మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి

బాపట్ల: బాపట్ల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మరాజు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు, మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన రోజు నుంచి అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లలా పాలన కొనసాగుతుందన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గవిని మాట్లాడారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తమ ఆస్తులను సైతం అమ్ముకుని ఈప్రాంతంలో కోన కుటుంబం సేవచేసిందని గుర్తు చేశారు. బాపట్ల నియోజకవర్గానికి సాగు, తాగునీరందించిన గొప్పనాయకుడిగా ప్రభాకరరావు ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్డిముక్కల డేవిడ్ మాట్లాడుతూ వేగేశన నరేంద్రవర్మరాజు తన ఆస్తులను కాపాడుకునేందుకే రాజకీయాల్లోకి వచ్చారని ధ్వజమెత్తారు. గతంలో నెలకు రూ.6వేలు జీతం తీసుకున్న నరేంద్రవర్మ నేడు వేల కోట్లకు అధిపతి ఏవిధంగా అయ్యారో చెప్పాలని నిలదీశారు. బాపట్ల పట్టణంలోని నరేంద్రవర్మరాజు 20 రకాలైన ఆస్తులను ఏవిధంగా కొనుగోలు చేశారో లెక్కలు చెప్పాలని ఇనగలూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేయటం అందరికి వచ్చని, నరేంద్రవర్మరాజు ఆస్తులపై విచారణ చేపట్టాలన్నారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా,అడే చందు, నర్రావుల వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ప్రగడ కోటయ్య సేవలు ఎనలేనివి

రేపల్లె చేనేత సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు



భట్టిప్రోలులో ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చేనేత సంఘీయులు

రేపల్లె: చేనేత పరిశ్రమ రక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేసిన చేనేత బాంధవుడు ప్రగడ కోటయ్యకు ప్రతి చేనేత కార్మికుడు రుణపడి ఉంటారని రేపల్లె చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య జయంతి సందర్భంగా పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రగడ కోటయ్య స్వాతంత్ర్య పోరాటంలో తనవంతు సేవలు అందించారన్నారు. నూలు ధరల స్థిరీకరణకు, నేత కార్మికులు నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధరలు లభించేలా అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా చేనేత కార్మికుల కోసం చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోటయ్య చిత్రపటానికి నూలు మాలలు వేసి నివాళులర్పించారు. రేపల్లె పద్మశాలియ బహుత్తమ సంఘం అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, రిటైర్డు పారామెడికల్ ఆఫీసర్ నారాయణం రామమోహనరావు, రేపల్లె చేనేత సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్ అడిగోపుల వెంకట కృష్ణారావు, అడిగోపుల రాంబాబు, సొసైటీ డైరక్టర్ పట్టెం లీలాకృష్ణ, సొసైటీ మేనేజర్ సాంబశివరావు, అడిగోపుల రెడ్డియ్య, చేనేత క్లస్టర్ ఆఫీసర్ భవానీ శంకర్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో

భట్టిప్రోలు: చేనేత రంగ అభివృద్ధికి ఎనలేని కృషి సల్పి తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు ప్రగడ కోటయ్య చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రగడ కోటయ్య జయంతి పురస్కరించుకుని బుధవారం భట్టిప్రోలు రథం సెంటర్‌లోని చేనేత బాంధవుడు, దివంగత రాజ్యసభ సభ్యుడు ప్రగడ కోటయ్య విగ్రహానికి చేనేత సంఘీయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చేనేత కార్మికుల కోసం పోరాడటమే ప్రగడ కోటయ్య తన దినచర్యగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు ఉన్న ప్రతి చోట అందరినీ కూడదీసి చేనేత సొసైటీలను స్థాపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ, భట్టిప్రోలు వీవర్స్ సొసైటీ అధ్యక్షులు కౌతరపు పిచ్చియ్యశాస్త్రి, జొన్నాదుల రామాంజనేయులు, సొసైటీ అధ్యక్షులు తిరువీధుల రాధాదేవి, చంద్రశేఖర్, ఉక్కడాల ఆనంద్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యుటివ్ పి.బాలకృష్ణ, సొసైటీ మేనేజర్ బి.కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళ మృతి

పిట్టలవానిపాలెం: చీరకు నిప్పంటుకుని మహిళ మృతిచెందిన దుర్ఘటన మండలంలో చోటు చేసుకుంది. పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామానికి చెందిన బోలె శ్రీలక్ష్మి(27) మహిళ ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పు అంటుకుని అగ్నికి కాలిపోయింది. స్థానికులు గమనించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం వైద్యశాలలో మృతి చెందినట్లు చందోలు ఎస్ఐ ఎస్.రాజశేఖర్ తెలిపారు.

కంప్యూటర్ స్కిల్స్ పెంచుకోవాలి

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా కంప్యూటర్స్ ఫండమెంటల్స్ అనే అంశంపై స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా గుంటూరు కేఆర్ఎస్ఎల్ కంప్యూటర్ సైన్సు అధ్యాపకురాలు వి.సునీత విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ స్కిల్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ స్కిల్స్‌ను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ముఖ్యఅతిథి సునీతను కళాశాల తరపున శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, కంప్యూటర్ అధ్యాపకులు సోమయాజులు, సిబ్బంది ఉన్నారు.

నేడు జగనన్న సురక్ష క్యాంపులు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని యలవర్రు, యడవూరు గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ సుభాని తెలిపారు. యలవర్రులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఎంపీడీఓ సుభాని తెలిపారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం



సర్టిఫికెట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ తదితరులు

వడ్డీవారిపాలెంలో జగనన్న సురక్ష క్యాంపు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్డీవారిపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్టిఫికెట్‌లు, వివిధ రకాల ప్రభుత్వ కార్యకలాపాలపై దూరప్రాంతాలలో ఉండే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా తాము నివసించే ప్రాంతాలలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. ఫలితంగా సచివాలయాలలోనే తమకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. నేడు ఆ సేవలు మరింత వేగవంతం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి అనేక సేవలను ప్రజలకు త్వరితగతిన చేరవేస్తున్నారన్నారు. అంతే కాకుండా నేటివరకు ఎటువంటి ప్రభుత్వ పథకాలకు నోచుకోని లబ్ధిదారులు ఉంటే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించుకునేందుకు, పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు చక్కని వేదికని చెప్పారు. అనంతరం గ్రామంలో 910 సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. తహసీల్దార్ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ వడ్డీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో..

అదేవిధంగా పట్టణంలోని 23, 25 వార్డులకు సంబంధించిన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్‌లు తులసీ దుర్గాప్రసాద్, షేక్ అస్ఫానాలు 950 సర్టిఫికెట్‌లు అందజేశారు.

రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

బాపట్లటౌన్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన బాపట్ల రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ పోలీసుల కథనం మేరకు ఒంగోలు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న రైలులో నుంచి గుర్తు తెలియని మహిళ బాపట్ల రైల్వే స్టేషన్‌లోని మూడో నెంబర్ ప్లాట్‌ఫాం చివర రైలు పట్టాలకు ప్లాట్ ఫామ్‌కు మధ్యలో జారిపడి మృతి చెందింది. మృతురాలి వద్ద తమిళనాడు రాష్ట్రం చంగాల్ పట్టిప్ రైల్వే స్టేషన్ నుంచి కర్నూల్ సిటీకి టికెట్ ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతురాలి పూర్తి వివరాలు తెలియ లేదని వివరాలు సేకరిస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసునమోదుచేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలు ఒంటిపై ఆకుపచ్చ పంజాబీ, తెల్లని ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. గుర్తించిన వారు బాపట్ల జీఆర్పీ పోలీసులను సంప్రదించాలన్నారు.

పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోండి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

తెనాలిఅర్బన్: కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువస్తోందని ఎన్‌సీఆర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మహ్మద్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ శిక్షణను రెండొవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక తరగతుల పాఠ్యపుస్తకాల సిలబస్‌లను మార్పు చేయడం జరిగిందన్నారు. వాటిపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు నిపుణులు వివిధ పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో సీఆర్ఎంటీ సీహెచ్ శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణిపూర్ క్రైస్తవులకు భద్రత కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

తాడేపల్లిరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని నిలువరించాలని కోరుతూ బుధవారం కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వద్ద నుంచి తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలువరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, గ్యాంగ్ రేప్‌లు చేసి చంపేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎం.జాన్ డగ్లస్, ప్రెసిడెంట్ ఎస్.జోసఫ్, సెక్రటరీ సీహెచ్ డేవిడ్ గాంధీ, మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.రవిప్రకాష్, సీడబ్ల్యూపీఎఫ్ పి.సహదేవ్, ప్రజా నాట్యమండలి నాయకులు జగన్, కొట్టె కరుణాకర్, ఐద్వా నేతలు గిరిజ, ఉష తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు



సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తత చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఫ్యామిలీ హెల్త్ వెల్‌నెస్ ప్రోగ్రాం కింద గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరీనాబేగంను వివరాలు అడిగారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలోని మందులు, ఓపీ వివరాలు, రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోని హాలులో ఆరోగ్యసిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్‌సీడీసీడీ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, బర్త్ ప్లానింగ్ వంటివాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు వివరించారు. ప్రతినెలా ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తామని, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రత్నమన్‌మోహన్, వైద్యాధికారులు ఫరీనాబేగం, యానీగ్రేస్, ఎస్తేరురాణి, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణంతో మెరుగైన సేవలు..

ఫిరంగిపురం: నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలోని స్థలాన్ని బుధవారం అధికారులతో కలిసి ఎ.శ్రావణ్‌బాబు పరిశీలించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ మాట్లాడుతూ పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. ఆయన వెంట జిల్లా ఉపవైద్యాఆరోగ్యశాఖాధికారి రత్నమన్‌మోహన్ ఉన్నారు.

ఎస్టీ కుటుంబాలకు బియ్యం, కూరగాయల పంపిణీ



బియ్యం, కూరగాయలు అందజేసిన దిలీప్‌రాజా

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామం వెలుపల పశ్చిమడెల్టా కొమ్మమూరు కాల్వ కట్టపై నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు సినీదర్శకుడు దిలీప్‌రాజా బుధవారం సాయంత్రం బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. గత కొద్దిరోజులుగా విడవకుండా కురుస్తున్న వర్షాలకు, వారంతా గుడిసెల్లోనే ఉండిపోయారని తెలిపారు. దీంతో ఆ కుటుంబాలకు రోజువారీ ఆహారానికి ఇబ్బంది రాకుండా ఉండాలని చిరుసాయం చేసినట్టు దిలీప్‌రాజా తెలిపారు.

కాల్వల్లో తూటికాడ తొలించాలని వినతి

తెనాలి: పంటకాల్వలు, మురుగు కాల్వల మరమ్మతులను, కాల్వల్లో తూటికాడ తొలించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటచేలు చెరువులుగా మారాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి రూరల్ మండలంలో 17 వేల ఎకరాలకు గాను కేవలం రెండు వేల ఎకరాల్లోనే ఇప్పటికి వెదసాగు చేశారని, కొల్లిపర మండలంలో 15,500 ఎకరాలకు 6,500 ఎకరాల్లోనే సాగయిందని వివరించారు. చేలల్లో నిలిచిన నీరు బయటకు పోయేందుకు పదిరోజులు పడుఉందనీ, రైతాంగం వద్ద విత్తనాలు లేక, నారు లేక ఆందోళన పడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన యంత్రాలతో గుర్రపుడెక్క, తూటాకును తొలగించాలని కోరారు. ఏపీ సీడ్స్ ద్వారా రైతాంగానికి విత్తనాలు, వరినారు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.